కలుషితమయిన
నేటి వ్యవస్థను
చక్కదిద్దడానికి
ఓ చిన్ని గులాబీ
చెప్పిన సలహా!

# ఎదురింటి గులాబీ


వక్కలంక సుబ్రహ్మణ్యం
కథ

చల్లటి గాలి రయ్యిన వీస్తోంది. రాత్రి పదకొండు దాటి వుంటుంది. కాటేజీలో ఒహటే ఉక్కపోస్తుంటే కాటేజీ వెనుకగా కొండల అంచున రోడ్డు ప్రక్కన ఓ బండరాయిమీద కూర్చున్నాను.

అది తిరుమల! సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వరుడు నెలవుండే కొండ! రాత్రి పదకొండయినా జనాలు మాత్రం మామూలుగా రోడ్లమీద తిరిగేస్తున్నారు. నాకు జనాల పొడ గిట్టదు. రద్దీ అంటే వల్లమాలిన అసహ్యం. చేంతాళ్లల్లాంటి క్యూలు, ప్రసాదాలకి తొక్కిసలాటలూ చూస్తే బోలెడు చిరాకు. అందుచేత నాకు నలభై ఐదేళ్లు దాటుతున్నా ఇంతవరకూ తిరుమలకే రాలేదు. పరమాతి పరమ నాస్తికుణ్ణయిన నేను హఠాత్తుగా తిరుపతికి వెళ్తున్నానని చెప్పేసరికి అందరూ ముక్కున వేలేసుకున్నారు.

కొందరు ''ఆ తిరుపతికి ఏదో మూడిందిరోయ్'' అంటే, కొందరు ''ఆ భేషజం లెదర్దా... ఇన్నాళ్లా లీవులన్నీ దాచి అమ్ముకునేవాడు. ఇవాళ గవర్నమెంటు నువ్వు లీవులమ్మినా కొనేది లేదని ఖచ్చితంగా చెప్పేశాక లీవులన్నీ ఏం చేసుకోవాలో అర్థంకాక ఇలా తిరుపతి, కాళహస్తి అంటూ బయల్దేరాడు'' అన్నారు. ఇంకొందరేమో గతంలో మా ఆవిడకి పెద్దాపరేషనయినప్పుడో, మా చిన్నాడికి తీవ్రంగా సుస్తీ చేసినప్పుడో ఎవరితోనూ చెప్పకుండా మొక్కేసుకునుంటానని కూడా అనుమానించారు.

అసలు కారణం చెప్పమంటారా - ఈ మధ్యన మా కొలీగ్సంతా తల్లిదండ్రుల పట్ల పుత్రుల బాధ్యత అనే అంశంమీద చర్చాకార్యక్రమం మొదలుపెట్టి అందరూ ఏకగ్రీవంగా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకుంటున్న విధానాన్ని మెచ్చేసుకుంటుంటే, ప్రక్క సీటు రమణమూర్తిగాడు ''ఏంటయ్యా



గొప్ప? ఓ నాలుగు సినిమాలకి తీసుకెళ్తేనూ, వేళకి ఇంత తిండి పెడితేనూ బాధ్యత అయిపోయిందా? ఇదంతా ఇహలోక సుఖం. ఇవాళో రేపో అన్నట్టున్న తల్లిదండ్రుల్ని దగ్గరుండి పుణ్యక్షేత్రాలు చూపించి తీసుకురానివాడుకూడా ఓ కొడుకేనా?'' అంటూ అగ్నిలో ఆజ్యంపోశాడు. అంతే ఆవేశం ఉవ్వెత్తున లేచి వెంటనే ఎప్పణ్ణించో తిరుపతి వెళ్దామనుకుంటున్న నా తల్లిదండ్రుల్ని అర్జంటుగా

బయలుదేరదీశా. అదీ సంగతి!

ఇంతలో ఉన్నట్టుండి కళ్లల్లో ఏదో కాంతి పడింది!.

ఏదో కారో జీపో రోడ్డుమీద మలుపు తిరుగుతోంది కామోసు అనుకున్నా. ఆ ఫోకస్ ఇంకా ఎక్కువయింది. నా కళ్లు ఆ కాంతిని తట్టుకోలేకపోతున్నాయి.

కాసేపటికి నా కళ్లు ఆ కాంతికి అలవాటు పడ్డాయి. క్రమేపీ ఆ కాంతిలోంచి ఓ ఆకారంకూడా స్పష్టమవుతోంది.

ఆరడుగుల భారీ విగ్రహం! ఆజానుబాహుడు, విశాలమైన ఛాతీ, నీలంరంగు పట్టుపంచె, దానిమీద నుంచి చిరుబొజ్జని అదుపుచేస్తూ తెల్లటి అడ్డకట్టు, భుజంమీద తెల్లటి కండువాతో పౌరాణిక సినిమాల్లో కృష్ణుడి వేషంలో కనపడే ఎన్టీఆర్ మల్లే వున్న ఆకారం స్పష్టంగా అవుపిస్తోంది.

నీలంరంగు శరీరం, గుండ్రటి మొహం, కాంతులీనే కళ్లూ, చిన్ని నోరూ, గెడ్డంమీద మధ్యలో ఓ చిన్న లొత్తా, సరిగ్గా దానిమీదే ఓ దిష్టిచుక్కా, ముక్కు సగభాగం వరకు మూసుకుపోయేంత తిరునామాలూ, గిరిజాల జుట్టు, చెవులకి అందమైన కర్ణాభరణాలు - సందేహంలేదు. సాక్షాత్తూ ఆ తిరుమలేశుడే!

మగాడికందముంటుందని నాకింతవరకూ తెలీదు. ఇగో ఇపుడు అనిపిస్తోంది. ఇతగాణ్ణి స్వయంగా చూసే ఆ బాపూ ఈయన బొమ్మె వేశాడో లేక బాపూ వేసిన బొమ్మలు చూసి ఇతగాడే ఆ వేషం ఎన్నుకున్నాడోగానీ - ఇతగాడికోసం జనాలు దేశదేశాలనుంచి విరగబడి తండోపతండాలుగా దిగుతున్నారంటే అందులో ఆశ్చర్యపోవలసింది ఏమీ లేదనిపించింది.

''ఏం స్వామీ! ఇలా వచ్చారూ?'' అన్నా కొంచెం పక్కకి జరిగి కూర్చుంటూ'' బండమీద చేత్తో తట్టి కూర్చోమని సైగ చేస్తూ.

''ఆ గర్భగుడిలో అసలూపిరాట్టంలేదయ్యా బాబీ! విజిటర్స్ రోజురోజుకీ ఎక్కువైపోతున్నారు. నీ పనే బావుందయ్యా పదకొండింటికి ఆఫీసుకెళ్తావు. ఠంచనుగా ఐదింటికల్లా లేచిపోతావు. నాకా అదృష్టం లేదయ్యా. ఓ వర్కింగ్ అవర్సూ లేవు. కనీసం ఆడదేవుళ్లలా కూర్చోడానికి లేదు. కాళ్లు నొప్పెడుతున్నా వచ్చేపోయే జనాలని చూస్తూ నిరంతరం నుంచునే వుండాలి'' అన్నారు శ్రీ స్వామివారు!

''గురూగారూ, మిమ్మల్ని అస్తమానూ పౌరాణిక సినిమాల్లో లాగా స్వామీ స్వామీ అంటం నావల్లగాదుగానీ, మిమ్మల్ని ఏకవచనంతో ముద్దుగా వెంకటేశ్ అని పిలుస్తా, మీకేమైనా అభ్యంతరమా?'' అడిగాను.

''సర్లేవోయ్ బాబీ, అలాగేకానీ! ఈ పేరేదో బానే ఉన్నట్టుందే'' అన్నాడు వెంకటేశ్ నా పక్కనే కూర్చుంటూ.

''మా ఆంధ్రదేశంలో ఓణీలేసిన ప్రతి ఆడపిల్లా మోజుపడే ఓ కుర్ర సినిమా హీరో పేరులే అది!'' అంటుంటే నవ్వుకుంటూ ఓసారి ఉత్తరీయం సర్దుకుని జుట్టు మరోసారి చేత్తో సర్దుకున్నాడు వెంకటేశ్. సినిమా హీరో అనేసరికి దేవుడుకూడా వెకిలి వేషాలు వేస్తాడన్నమాట అనుకున్నా!

''గురూ నీకో కాంప్లిమెంట్ ఇవ్వాలనుంది. యూ ఆర్ క్వయిట్ హాండ్సమ్! 'చిరుతనవ్వులవాడే వీడు వెరపెర గడుసూ వాడే' అని నీ భట్రాజు అన్నమాచార్యుడు తెగ కీర్తించేస్తుంటే అంతా ట్రాష్ అనుకున్నా. కానీ నువ్వు అచ్చు మా పాండవ వనవాసం, కృష్ణార్జున యుద్ధం టైపు కృష్ణుడిలానే వున్నావు''

''కృష్ణుడిలా ఏంటి బాబీ, కృష్ణుణ్ణేగా!''

''ఆ మర్చేపోయా, నీవి దశావతారాలుగదూ.

అవునూ, ఇంతకీ మధ్యలో ఆపేశావూ, గుళ్లో నీకు తోచకపోవడం ఏమిటి? ఇండియా మొత్తానికి అత్యధిక భక్తులుగల మొనాపలీ దేవుడివి నువ్వేగదా - నీ భక్తుల్ని చూసి గర్వపడాలిగాని మరిలా బెంబేలెత్తి పారిపోయి వచ్చేశావేంటి?'' అన్నాను నేను.

వెంకటేశ్ సర్దుక్కూచున్నాడు. అంటే చాలా పెద్ద వివరణ ఇస్తాడనర్థమేమో!

''బాబీ, నా దగ్గరకొచ్చే వాళ్లంతా నా భక్తులేనంటావా? కాదు. నూటికి తొంభైమంది ఏదో సందర్భంలో నాకు మొక్కుకుని నాకు బాకీపడి అది తీర్చుకోకపోతే లేనిపోని గొడవలొస్తాయేమో ఆ వెధవ మొక్కేదో తీర్చేస్తే దరిద్రం వదిలిపోతుంది అనుకుంటూ వస్తారు. కొంతమంది ఇక్కడి సీన్లూ లొకేషన్లూ బావుంటాయి కనుక పిక్నిక్కి వచ్చి, పన్లో పనిగా నన్ను దర్శించకుని పోతారు.

''గంటలకొద్దీ ఒక్కోసారి పూటలకొద్దీ ఆ క్యూలో నించుని వస్తారేమో, సరిగ్గా నా దగ్గరకు వచ్చేసరికి నాళ్లకి ఎక్కడలేని నీరసం, చిరాకూ వస్తాయి. కిట్టనివాళ్లెవరో నా తిరుపతిలో దొంగలెక్కువని తెగ ప్రచారం చేశారల్లే వుంది. నా ముందు నుంచుని కళ్లు మూసుకుని దణ్ణం పెడుతూ మధ్యమధ్యలో జేబులో పర్సుందో లేదోనని తడుముకునేవాళ్లే ఎక్కువ!

''ఇక పిల్లలతో వచ్చినవాళ్లయితే వాళ్ల దృష్టి అంతా పిల్లలమీదే వుంటుంది. భక్తిగా కళ్లు మూసుకు దణ్ణం పెడుతూ కూర్చుంటే పిల్ల వెధవలెక్కడయినా తప్పిపోయేడుస్తారేమోనని నా ముందురకి వచ్చినా వాళ్లు నన్ను లెక్కచెయ్యకుండా ఒరే నానీ, ఒరే చిన్నా, ఒరే కన్నా అంటూ పిల్లల వెనకే పరుగులు పెడుతూ నన్ను దాటేస్తారు.

''మరి కొందరయితే తిరుపతిలో నన్నుకూడా ఛాన్స్ దొరికితే కొనెయ్యడానికి రెడీగా చేతిలో క్యాష్ బ్యాగ్‌తో వస్తారు. క్యూలో వాలంటీర్ల దగ్గరనుంచి పూజారులదాకా ప్రతిచోటా ప్రతిదానికీ అయిదూ పదీ ఇచ్చుకుంటూ నా దగ్గరకు వచ్చినా శఠగోపం పెట్టేవాడికీ తీర్థం పోసేవాడికీ కూడా ఐదులూ, పదులూ ఇస్తూ ఆ చిల్లరలన్నీ లెక్క చూసుకుంటుండగానే నన్ను దాటేసి వెళ్లిపోతారు.

''ఇక నీలాంటి వాళ్లయితే ఆ ఇనపగేట్ల బంధికానానుంచి ఎప్పుడు బయట పడిపోతామా, ఎప్పుడు గాలి పీలుద్దామా అని హడావుడిగా

## సీలింగ్

''మీరు నగ్నదృశ్యాల్లో నటిస్తున్నప్పుడు మీకు ఎటువంటి ఫీలింగ్స్ కలుగుతాయి?''

'నగ్నంగా నటిస్తున్న ఫీలింగ్స్ కలుగుతాయి' అంది సెక్సిణి.

- జి.వాసు (ఖమ్మం)



బయటకు పరుగెడుతుంటారు. మరికొందరయితే అంత దూరం క్యూలో నించుని వచ్చి సరిగ్గా నా దగ్గరకి రాగానే, మున్సిపాల్టీ టోటీవాడు మురికి కాలువలోంచి చెత్తలు అడ్డుకుంటే కర్రతో తోస్తున్నట్టు నా భక్తుల్ని ముందుకు తోసేస్తుంటే వాళ్లనే గుడ్లప్పగించి చూస్తూ అసహ్యించుకుంటూ తిట్టుకుంటూ నా ముందునుంచి నిష్క్రమిస్తారు.

''ఈలోగా ఎవడో ఒకడు వాళ్లతో గొడవపడతాడు. ఆ గొడవ చూస్తూ ''అవునండీ నిన్నరాత్రినుంచి నుంచుంటే ఇప్పటికి వచ్చింది. వీళ్లకి లైన్లోలేని తొందర ఇక్కడే వస్తుంది'' అని వత్తాసు పలుకుతూ వాళ్లలో వాళ్లు చర్చించుకుంటూ అక్కణ్ణుంచి బయటకు పోతారు''

వెంకటేశ్‌ని చూస్తే జాలేసింది. అదే అన్నాను.

''నిన్ను చూసి మొదట్లో అసూయ పడేవాణ్ణోయ్! ఇండియాలో అత్యధిక ఆదాయం సంపాయిస్తూ పన్నుకట్టకుండా ప్రజలందర్నీ దోచేస్తున్నావని తెగ బాధపడి పోయేవాణ్ణి. ఆదాయప్పన్ను ఎగవేసేవాళ్లంతా ఇన్‌కంటాక్స్‌వాళ్లకీ, ఏసీబీవాళ్లకీ, పత్రికలవాళ్లకీ ఇలా వాడూ వీడూ అని లేక అందరికీ భయపడి చచ్చిపోతూ బతుకుతుంటారు. నువ్వు వాళ్లకన్నా ఎక్కువ శిక్షే అనుభవిస్తున్నావులే. నీకు వేరే టాక్స్ అక్కర్లేదులే. యూ ఆర్ ఆల్రెడీ టాక్స్‌డ్!'' అంటూ వీపుమీద గురుణ్ణి మెత్తగా ఒకటి చరిచా!

గురుడు ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. అటు చూడు అన్నట్టుగా సైగ చేశాడు. ఏంతోనని వెనక్కి తిరిగి చూశాను. నా వెనకే నా అర్ధాంగి సీతామహాలక్ష్మి. నన్ను మూర్ఖ శిఖామణిని చూసినట్టు చూస్తోంది!

''ఏమయిందండీ మీకు? ఆదాయప్పన్నేమిటి? ఎవర్తో మాట్లాడుతున్నారు? అసలు ఇక్కడ చీకట్లో కూర్చున్నారేంటి?'' అంటూ ఆందోళనగా అడిగింది.

''ఎవర్తో ఏవిటే? నీ ఇష్టదైవం, వడ్డీకాసులవాడితో. వీడికక్కడ గర్భగుళ్లో గాలాట్టం లేదట. ఏదో పిచ్చా పాటీనూ. పొద్దుట మళ్లీ దర్శనానికి వెళ్తానన్నావ్‌గా. ఇప్పుడు ఈయన కాళ్లమీద పడిపో చాలు'' అన్నాను. మా ఆవిడకి ముక్తికి దగ్గర దారి చూపిస్తూ గర్వంగా!

''వడ్డీకాసులవాడేవిటండీ, ఏమయిందండీ మీకు? అయిపోయిందత్తయ్యగారోయ్, నేననుకున్నదంతా అయిపోయింది! స్వామి చాలా మహిమ గల దేవుడండీ, అవాకులు చవాకులు పేలొద్దండీ అంటే విన్నారూ? ఇప్పటికైనా మించిపోయింది లేదు. రండి ఈసారైనా స్వామిని భక్తిగా దర్శించుకోండి. మళ్లీ మామయ్యాలు మనిషయిపోతారు'' అంటూ ఏడ్చినట్లుగా మాట్లాడుతోంది సీతామహాలక్ష్మి.

''నీకేమయినా పిచ్చి పట్టిందా? నువ్వు కొలిచే దైవం గుళ్లో లేడు. ఇక్కడ వున్నాడంటే నమ్మకుండా దర్శనానికి ఎక్కడికో వెళ్తానంటావేంటే. త్వరగా దణ్ణం పెట్టుకో, అసలే మీ దేవుడికి టైం వుండదు. ఎప్పుడు అదృశ్యమయిపోతాడో తెలీదు''

''మామయ్యగారండోయ్ ఈయనకేదో అయిపోయిందడోయ్'' అంటూ గావుకేకలు పెట్టుకుంటూ కాటేజీలోకి వెళ్లి వాళ్ల అత్తగార్నీ మామగార్నీ వెంటబెట్టుకు వచ్చింది.

వెంకటేశ్ నోరెళ్లబెట్టుకుని చూస్తూ వుండిపోయాడు.

''అన్నట్టు వెంకటేశ్‌ను నీకు పరిచయం చేయలేదుకదూ? ఈవిడ మా ఆవిడ సీతామహాలక్ష్మి పరమ సాధ్వీమతిలే! ఆవిడేమో మా అమ్మగారు. ఆవిడ నీముందు కాస్త ఎక్కువగానే తాగింది. నీ మీద శార్దూల ఛందస్సులో ఓ శతకం

రాసింది. ఆ పుస్తకం నీకు అంకితం ఇవ్వడానికే ఆవిడ వస్తే! ఇక ఈయన మా నాన్నగారు. రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, శ్రీకాకుళం'' అంటూ మా కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశా.

అందరికీ నమస్కారం చేశాడు వెంకటేశ్. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. అంత పెద్ద తిరుమలకి దేవుణ్ణనే అహంభావం లేదు గురుడిలో. అందుకే వాడు నాకు తొలిచూపులోనే నచ్చాడు.

''అత్తయ్యగారండీ. ఇప్పుడేవిటీ దారీ? ఈయన ఇహ మామూలు మనిషవుతారా?'' అంటూ సీతామహాలక్ష్మి ఏడుపులంకించుకుంది. మా అమ్మగారు తన్ని ఓదారుస్తున్నారు.

''నిజమేరా బాబీ, దైవదూషణ మంచిదికాదు. ఒకసారి స్వామిని దర్శించుకో, ఎందుకైనా మంచిది'' అన్నారు మా నాన్నగారు శాంతంగా.

''అయ్యబాబోయ్ ఆ కటకటల్లోకా? నేనురాను బాబోయ్. మీ దేవుడే అక్కడుండలేక ఇక్కడకొచ్చేస్తే అక్కడికెళ్లి ఆ రాతి బొమ్మకి మొక్కమంటారేమిటి? నాన్నగారూ ఒక పని చెయ్యండి. మీరంతా వెళ్లి లైన్లో నుంచుంటే పొద్దుటే సుప్రభాత సేవ అందుతుంది. చూసి రండి. మీరేం భయపడకండి. నాకేమీ అవ్వలేదు.'' అన్నాను.

''సుప్రభాత సేవ అందుతుందీ అదీ ఇదీ అంటున్నాడే. వీడికేమీ అవ్వలేదు. తెలివిగానే వున్నాడు. ఏ పుట్టలో ఏ పాముందో ఆ స్వామి వీడి నోటితో చెప్పించేడల్లే వుంది. అంతా అదే సర్దుకుంటుంది. దేవుడిమీద విశ్వాసముంచి పదండి'' అంటూ మా నాన్నగారు, ఆడవాళ్లిద్దర్నీ సమాధానపరిచి మా చిన్నాణ్ణి లేపి నా దగ్గర కూచోబెట్టి, ఎక్కడికీ వెళ్లిపోవద్దని అనేకసార్లు హెచ్చరించి వాళ్లంతా గుడివైపు కదిలారు. మా సీతామహాలక్ష్మి సరేసరి, అవే ఇహ ఆఖరి చూపులన్నట్టు నాకేసి చూస్తూ కనుమరుగైంది.

మా ఆవిడ చాదస్తం కాకపోతే మా చిన్నాణ్ణి నాకు కాపలా పెట్టింది. వాడు హాయిగా నా ఒళ్లో తల పెట్టుకుని పడుకుని నిద్దరోతుంటే నేనే వాడికి కాపలా కాస్తున్నా. లోపలికి వెళ్లి దుప్పటిలాంటిదేదైనా తెచ్చి వాడి మీద కప్పితే బాగుణ్ణు అనుకున్నా. కానీ లోపలికెళ్తే ఈ వెంకటేశ్ వెళ్లిపోతే? ఈ జనసందోహాలమధ్య మాట్లాడేవాడు లేక ఒంటరిగా వుండాల్సి వస్తుంది.

## సామూహిక పెళ్లిచూపులు



ఈ మధ్యన సామూహిక పెళ్లిచూపులూ... వివాహాల జోరు కాస్త పెరిగింది. అలాంటి ఓ సామూహిక పెళ్లిచూపులు మొన్నీమధ్యనే ఢిల్లీలోని తాలేకటోరా స్టేడియంలో జరిగాయి. అగర్వాల్ కులస్థులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వందలాది యువకులు, పెళ్లికావలసిన ముద్దుగుమ్మలూ ఆ స్టేడియంలో సమావేశమై ఉదయంనుంచి సాయంత్రందాకా ముచ్చట్లాడుకుంటూ ఇద్దరూ ఒప్పుకున్న తర్వాత వేదికమీదనుంచి 'మేం పెళ్లిచేసుకుంటున్నాం' అంటూ ప్రకటనలు చేశారట! పరిచయ సమ్మేళన్ అనే ఈ కార్యక్రమంలో ఎన్నో జంటలకు పెళ్లి గంటలు మోగాయట! శుభం!!

- జూపిటర్

అనుకున్నదే తడవుగా వెంకటేశ్ తన ఉత్తరీయాన్ని తీసి మా వాడికి కప్పి, భయపడకు. నీతోటి పనుండే వచ్చాను. ఇప్పుడిప్పుడే వెళ్లిపోనులే'' అన్నాడు వెంకటేశ్.''కానీ మీవాడు భలే ముద్దుగా వున్నాడోయ్'' అంటూ నవ్వేడు వెంకటేశ్ మళ్లీ.

''చాల్చాల్లేవయ్యా - ప్రమోషన్లకోసం ఆఫీసరుగారి గజ్జికుక్కని ముద్దులు పెట్టుకునే జాతివాడి. నాకే డూప్ కొడతావా? మావాడందంగా వున్నాడూ? వాడికి మొన్నే అమ్మవారొచ్చి తగ్గింది. ఇంకా ఆ మచ్చలన్నీ పోలా!'' అన్నా కోపంగా.

''డూప్ కాదోయ్, చూడు'' అంటూ మావాడి మొహంమీంచి ఉత్తరీయాన్ని జరిపి చూపించాడు వెంకటేశ్. నిజమే మొహంమీద మచ్చలన్నీ పోయాయి.

''ఇదిగో వెంకటేశూ, ఇట్టాంటియన్నీ నాక్కిట్టవ్. నీకునాతో ఏదైనా పనుంటే తిన్నగా అడుగు. ఈ మహిమలు చూపించేవాళ్లు అంటేనే నాకు ఒళ్లు మంట. ఇంతవరకూ ఏ వెధవాయీ ఏ శాస్త్రంలోకూడా దేవుడనే వాడికి మంత్రాలొచ్చి వుండాలన్న మినిమమ్ క్వాలిఫికేషనేవీ పెట్టలా! మంత్రాలూ, తంత్రాలూ చేయడానికి నువ్వేమయినా మంత్రగాడివా, దొమ్మరివాడివా, కనికట్టు మోళీగాడివా? నువ్వు ఒరిజినల్ దేవుడివో కావోనని నేను సందేహించేస్తున్నానేమోనని ఈ నీచ ప్రదర్శనకి దిగావు'' అన్నాను ఆవేశంగా.

నా ఆవేశానికి రెట్టింపు మందహాసం చేస్తూ ''సారీ బాబీ, నీ మనసు కష్టపెట్టాలనికాదు. కుర్రాడందంగా వున్నాడు కదాని. అందునా ఇందాక మీ వాళ్లెవ్వర్నూ నిన్ను నమ్మలేదు చూడు. వాళ్లు తిరిగి వచ్చి నీవు చెప్పింది నమ్ముతారనీ'' అంటూ నసిగాడు.

''ఆహాహ్. మానవులకే కుతంత్రాలు నేర్పుతావా? తెలివున్నవాడెవ్వడైనా నీ మాట నమ్ముతాడా. వాళ్లు తిరిగి వచ్చేసరికి ఇది చూస్తే అక్కడి బండ రాయిలో ఏదో మహిమ వుండబట్టే అలా జరిగిందని మరింత మూఢనమ్మకం పెంచుకుని మళ్లీ మళ్లీ నీకొండకి రప్పించుకోవాలని నీ కుతంత్రం.

''చూడు వెంకటేశూ, నీ మీద నాకేమాత్రం సదభిప్రాయం లేదు. దేవతలంతా లేచి తలారా స్నానాలు చేసేసి కాఫీ టిఫిన్లు కానిచ్చేసినా నువ్వింకా పక్కమీంచి లేవని బద్ధకిష్టు దేవుడివని ప్రతిరోజూ నీ భక్తులు 'సచతుర్ముఖ షణ్ముఖ పంచముఖ ప్రముఖాఖిల దేవత మౌళిమణే'' అంటూ సుప్రభాతంలో రోజూ నిన్ను తిడుతున్నా నీకర్థంకాదు.

''మా తెలుగు సినిమాల్లో పేదవాళ్లకి నిజంగా అప్పిచ్చి దాని వడ్డీ, అసలూ మింజువలె వాడి ఇల్లో, పొలవో లాగేసుకుంటే వాడు మహా మహా విలను. నువ్వసలు ఎవ్వడికీ అప్పివ్వ సరిగదా, ఏదో అవసరానికి మొక్కుకుంటే దానికి కూడా వడ్డీ అడుక్కుని, రెండో పెళ్లికి చేసిన అప్పులు తీర్చుకుంటున్నావు.

''నిజంగా నీకు కపటం లేకపోతే నీ ఉనికిని తెలియజేయాలనుకుంటే ఇందాకా మా ఆవిడకి కనపడకపోయావ్? అయినా నాకు తెలీకడుగుతానూ, నిన్ను నమ్మి జీవితం అంతా నీ భక్తిలో వృధా చేసుకునేవారికి కనపడకుండా నాలాంటివాళ్లకి కనపడతావెందుకు? వెళ్లి వెళ్లి ధృతరాష్ట్రుడిలాంటి నీచుడికి దివ్యదృష్టి ఇచ్చి మరీ కనపడ్డావుగానీ ఎప్పుడైనా ధర్మరాజుకి నీ నిజరూపం చూపించావా?

''ఇగో వెంకటేశూ, ఇదే చెప్తున్నా ఇలాంటి చీప్ ట్రిక్స్ నా దగ్గర కుదరవ్. ముందు మా అబ్బాయిని

మునుపట్లా చెయ్యి. అప్పుడు నాతో నీకు పనేవుందో చెప్పు. నా చేతనైతే చేస్తా'' అన్నాను నేను.

వెంకటేశు ప్రసన్న వదనుడై ''అలాగే కానీయబ్బా - కోప్పడకు. మీవాణ్ణి మునుపట్లా చేసేసా చూసుకో.

''నువ్వన్నావే బద్ధకమనీ - అది బద్ధకం కాదోయ్, దేవతల్లో నాకున్న స్టేటస్ అది. మీ ప్రధానమంత్రి ఎక్కడేనా కార్లో వెళ్లాడనుకో. తలుపు తీసుకుని దిగిపోతాడా? దిగడు. జవానొచ్చి డోర్ తీసేవరకూ అలానే కూర్చుంటాడు. ఇదీ అంతే!


''బాబీ, నేను కనబడాలంటే భక్తితో పూజలు చేసెయ్యడం ఒక్కటే మార్గమనుకుంటూ పొరపాటు పడతారందరూ. నువ్వెవరినయితే భక్తులని పేరుపెట్టావో వాళ్లంతా నా లెక్కలో భక్తులు కారు. నాక్కావాల్సింది నా మీద నమ్మకం. భగవంతుడు అంటే గర్భగుడిలో హారతి కర్పూరాలు, దీపాలు, అగరొత్తులూ వెలిగించగా వచ్చిన నిల్వ వాసనలో చీకటిలో మాత్రమే రాయిగా వుంటాడనుకునే వాళ్లెవరూ నా భక్తులు కాదు.

''మానవజాతి పరిణామ దశలో తమ తమ తెగలు ఆ కీకారణ్యాల్లో ఎక్కడున్నాయో గుర్తుంచుకోడానికి విలుగా పెట్టుకునే గుర్తులే రానురాను కులదేవతలుగా, గ్రామదేవతలుగా మారి ఈనాటికి అవి మతాన్ని సూచించే బలమైన స్థావరాలుగా ఎదిగాయి''

నేనన్నాను! ''అయ్యా వెంకటేశూ, నీ ఇద్దరు భార్యలూ, నిన్ను తన్ని ఇంట్లోంచి గెంటేశారో ఇప్పుడర్థమయింది. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుందాం రావయ్యాంటే - మతాలు, రాజకీయాల్లోకి పోతున్నావు. నాకింకోటి కూడా అర్థమైపోయింది. ''బావా, చుట్టాల్ని తెగనరకడం పాపమేమో''నని ఒక్క మాట అన్నందుకు అర్జునుణ్ణి పద్దెనిమిది అధ్యాయాలుగా నంచుకు తినేశావ్! నీ బాధ పళ్లేక యుద్ధమే చేస్తా పద అన్నాడు'' అన్నాడు నేను తల పట్టుకుంటూ.

''నీ కుళ్లు జోకులకి నవ్వడానికి నేనేం నీ పాఠకుణ్ణి కాదుగానీ, అసలు పాయింట్లోకి వచ్చెయ్యనా?'' అన్నాడు వెంకటేశ్.

''ఉపోద్ఘాతాలేవీ లేకుండా టూకీగా చెప్పు'' అని ఏం అడుగుతాడోనని భయపడుతూ చూస్తున్నా. పెద్ద దేవుళ్ళు వెనకా ముందుగా ఆలోచించుకోకుండా వరమిచ్చేశా కోరుకో అని.



ఇప్పుడు ఏ ఎల్కేజీలోనో సీటు సంపాయించమనో, కనీసం వానాకాలమయినా కుళాయిలో రోజు విడిచి రోజుకాకుండా ప్రతిరోజు మంచినీళ్లు తెప్పించమనో, కొత్త గ్యాస్ కనెక్షన్ ఇప్పించమనో, పరుగెత్తకుండా ఆర్టీసి సిటీ బస్సెక్కమనో ఇలాంటి గొంతెమ్మ కోర్కెలేవేనా కోరితేనో?

''ఏం లేదోయ్ బాచీ, నన్ను నాయకుడిగా పెట్టి నా మీద ఓ కథ రాసిపెట్టవూ'' అన్నాడు వెంకటేశ్ ముద్దుముద్దుగా.

నేను నవ్వి, ''శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యము''ను శృంగార ప్రబంధము రాయమందురా స్వామీ?'' అన్నా వేళాకోళంగా.

''ఎకసక్కెలు కాదోయ్. నిజంగానే అదే నా కోరిక లేకపోతే పని కట్టుకుని ఎందుకొచ్చాననుకున్నావ్. నీ దగ్గరికి? నీ స్నేహితుడిగా, మీ ఇంటిల్లిపాదీ ఆరాధ్య దైవంగా అడుగుతున్నాను. ప్లీజ్ కాదనకు'' అన్నాడు వెంకటేశ్ నా చేతులు పట్టుకుంటూ.

''అదిగాదూ'' అంటూ నసిగాను.

''నాకు తెలుసు. నీకు దేవుడిపట్ల మతంపట్ల విశ్వాసం లేదని. అందుకే నిన్ను ఎన్నుకున్నా. నువ్వెలాగైనా రాసుకో, కానీ నేనే ముఖ్యమంత్రి పాత్రధారి అయి వుండాలి.

''నాకింకోటి కూడా తెలుసు. పీయూసీ చదువుతున్నప్పుడు మీ వదినగారు మహా రచయిత్రి అయిపోవాలనే సత్సంకల్పంతో ఓ నోటుబుక్కు కొనుక్కొచ్చి ''ఎదురింటి గులాబీ నవ్వింది'' అని టైటిలు పెట్టేసి కథ ఏం రాద్దామని ఆలోచిస్తూ ఆలోచిస్తూ వృద్ధాప్యంలోకి వచ్చేసిందనీ, నీ తదుపరి కథకి ఆమె పెట్టిన పేరు పెట్టుకుంటానని వాగ్దానం చేశావనికూడా తెలుసు. పేరేమైనా పెట్టుకో, నాయకుడు మాత్రం నేనే!'' అంటూ నా చెయ్యి లాక్కున్నాడు.

''ఇదో వెంకటేశూ, తీరా రాస్తానని రాయలేకపోతే నీ సత్యనారాయణ వ్రతకథల్లోలాగా నా ఉద్యోగం ఊడిపోయి, నా భార్యకి పక్షవాతం వచ్చేసి, పిల్లలిద్దరూ ఇల్లు విడిచి పారిపోయి - ఇలాంటి కార్యక్రమాలేవేనా నడిపిస్తావా నాయనా?'' అన్నాను అనుమానంగా.

''మళ్లీ మొదటికి వస్తున్నావ్. నేనేదేనా చెప్పేనంటే అతిగా వాగుతున్నానంటావ్ మరి. హాని చేసే వాడసలు దేవుడే కాడోయ్ వాడు రాక్షసుడు. దేవుడనేది ప్రేమకి మరో స్వరూపం. దేవుడికి పగా ద్వేషం వుండవు. దేవుణ్ణి నమ్మకపోతే ఏదో అనర్థం జరుగుతుందీ అంటే అది మనుషుల మూర్ఖత్వం తప్ప మరేం కాదు. ఇప్పటికయినా ఒప్పుకోవయ్యా బాబూ'' అన్నాడు.

''చూడు వెంకటేశూ నేనేం పెద్ద చెయ్యి తిరిగిన మహా రచయితనిగాను. ఎప్పుడోగానీ రాయను. అస్తమానూ ఆఫీసులోనూ, బజారుల్లోనూ ప్రత్యక్షమయిపోయి-నా కథ రాశావా అని అడక్కు. నాకేదో పిచ్చెక్కిందనుకుని లాక్కెళ్లి పిచ్చాస్పత్రిలో పడెెగ్గలు'' అన్నాను.

దానికి వెంకటేశు సరే నన్నాడు.

తిరుపతినుంచి వచ్చిన ఓ వారందాకా మా సాధ్వీమణి ఇరుగూ పొరుగూ ఇంతులందర్నీ ఇంటికి పిలిశ్రీ వేంకటేశ్వరస్వామివారు నామీద ఆగ్రహించిన విధమూ, నాకు మతిభ్రమించిన వైనమూ, ఆమె భర్తకోసం అకుంఠిత దీక్షాపరులై తిరిగి క్యూలో నిల్చున్న చందమూ, కథాంతమున స్వామి ప్రసన్నుడై నన్ను పూర్వస్థితికి చేర్చిన వివరమూ వివరించి చెప్పి, ఆ కథ విన్నవారందరికీ శ్రీ స్వామి వారి ప్రసాదం పెట్టి సాగనంపుతోంది.

లోపలికి వెళ్లే ఆడంగులంతా అరుగుమీద పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదూకునే నాతో

బావున్నారా అన్నయ్యగారూ'' అని వెళ్ళి, వచ్చేటప్పుడు మాత్రం 'కొంపదీసి ఈ పిచ్చోడు లేచొచ్చి నా జాకెట్ చింపెయ్యడుగదా అన్నట్టు భయంగా చూస్తూ వెళ్తున్నారంటే - అదంతా ఆ సీతామహాలక్ష్మి వర్ణనా పటిమ!

రోజులు దొర్లిపోతున్నాయి. నేను తిరుపతిగురించి దాదాపు మర్చిపోయాను. మా సీతామహాలక్ష్మికూడా ఇంక మా పేటలో శ్రీ వెంకటేశ్వర మహాత్యం కేసెట్ విననివాడు ఒక్కడూ మిగలకపోవడంతో క్రమేపీ ఆవిడ కూడా మరచిపోయింది.

★ ★ ★

ఉన్నట్టుండి ఓ ఆదివారంనాడు మొత్తం భారద్దేశమంతా గగ్గోలు గగ్గోలయిపోయింది. అయోధ్యలో ఓ పురాతన కట్టడం నేలమట్టం చేశారు. జాతి యావత్తూ సిగ్గుతో కుచించుకుపోతోందని ప్రధానమంత్రిగారొచ్చి టీవీలో చెప్పారు. ''సిగ్గుచేటు'' అంటూ దేశంలోని పత్రికలన్నీ గొంతెత్తి అరిచాయి ఏకకంఠంగా!

పర్యవసానంగా దేశంలోని మత సంస్థలన్నీ రద్దయ్యాయి. ఆ మత సంస్థలతో లావాదేవీలున్న నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలుకూడా నేలమట్టం అయ్యాయి.

దేశమంతా హత్యాకాండ మొదలయింది. ఎవరు ఎవర్ని ఎందుకు నరుకుతున్నారో తెలీని నరమేధం మొదలైంది. వెయ్యిమంది పోయుంటారని కొందరంటే కాదూ పదివేలదాకా లేచిపోయుంటారనేవాళ్లు కొందరు.

దీని ఫలితం ఇంగ్లాండేమిటి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్సేమిటి, మొత్తం ప్రపంచం చవిచూసింది.

పక్కింట్లో ఆయన తాగేసొచ్చి పెళ్లాన్ని కొట్టాడు కనుక మీరుకూడా తాగేసొచ్చి మీ మీ పెళ్లాల్ని చావబాదండోయంటూ పొరుగుదేశం పాకిస్తాన్ ముస్లిం దేశాలన్నింటికీ హితబోధ చేసింది! హడావుడిగా ఏదో డామ్ కడుతున్నంత ఆర్భాటంగా హిందూ దేవాలయాలన్నీ నేలమట్టం చేశారు.

ఇటుపక్క బంగ్లాదేశయితే సరేసరి, మన ప్రధాని వాళ్ల దేశంలోకి వస్తే చంపేస్తామనేంతవరకూ వచ్చింది.

అప్పుడు లేచాడండీ నాలోని కవిగాడు! వాడు అస్తమానూ లేవడు. భోపాల్లో గ్యాస్ లీకయితేనే,

## హారర్

''సినిమాలో హీరో, హీరోయిన్లకి మేకప్ లేకుండా ఓ సినిమా తీద్దామని అనుకుంటున్నాను'' అన్నాడు దర్శకుడు.

''సారీ సర్! 'హారర్' చిత్రాలు తీయడం నాకు ఇష్టంలేదు'' చెప్పాడు నిర్మాత.

- ఎస్. నాగరాజు (నంద్యాల)



బోఫోర్స్ కుంభకోణాలకో, హర్షద్ మెహతా జైలుకెళ్లినప్పుడో, గరల్స్ హాస్టల్ వ్యభిచార గృహంగా మారినప్పుడో, మహారాష్ట్రలో భూకంపం వస్తేనో తప్ప లేవడు.

రాయగలిగే శక్తి ఉన్నంత మాత్రాన, నడిరోడ్డులో హత్య చేసేసి పోలీసులకి చిక్కకుండా ఎలా ఎలిబీలు సృష్టించుకోవచ్చో, మొగుడుండగానే పక్కింటి కాలేజీ కుర్రాడితో ఎలా రమించవచ్చో రాసి పేరు ప్రఖ్యాతులు గడించేకన్నా మిన్నకుండడమే ఉత్తమమం. సమాజానికి పనికిరాని ట్రాష్ రాసేవాడు రచయితే గాదని నా కవిగాడి అభిప్రాయం.

కథాసాగర మథనం మొదలైంది నా మస్తిష్కంలో. కథావస్తువు సిద్ధంగానే వుంది. అయితే ప్రెజెంటేషను ఎలా వుండాలీ అన్నదే సమస్య. నాల్గైదురోజులు మదన పడ్డాక ప్రస్తుతం సంఘం దృష్టిలో ఈ సమస్య ఎంత సీరియసయినప్పటికీ రచయిత దృష్టిలో అంతా ఓ ట్రాష్ కాబట్టి కథని వ్యంగ్యంగానే రాయాలని నిర్ణయించుకున్నాను. అలా చేస్తే రామాయణం నాటకం స్టేజీమీద వేస్తుండగా మధ్యలో హఠాత్తుగా భీముడు రంగప్రవేశం చేసినట్లుగా గతంలో నేను నా మిత్రుడికిచ్చిన మాటా, మా వదినగారికిచ్చిన మాటా నిలబెట్టుకోవడానికి ఛాన్సుంటుంది.

కథ మొదలైంది. డిసెంబరు ఆరు అంటూ చకచకా కాయితం మీద కలం పరుగులు తీసింది. కథ పూర్తయింది.

కథలో అయోధ్యలో కట్టడం పూర్తిగా పడిపోయాక ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోగానే ఓ రాత్రివేళ మా వెంకటేశు అక్కడికి వెళ్లి రాంలాలా విగ్రహాల్ని పట్టుకొచ్చేస్తుంటే బోర్డరు సెక్యూరిటీ జవాన్లు వాణ్ణి అటకాయించి, చితగ్గొట్టవలసిందంతా కొట్టేసి మర్నాడు కోర్టులో హాజరుపరుస్తారు. వెంకటేశేమో తనే రామావతారంకూడా ఎత్తేననీ, అది తన చిన్ననాటి ఫోటోల్లాంటివి కాబట్టి తనకిప్పిస్తే తీసుకెళ్లి తిరుపతిలో పెట్టుకుంటానంటాడు. జడ్జిగారు దాందేముంది. అలాగే పెట్టుకుందువుగాని గానీ అలాని ఓ పిటిషను పెట్టుకో అంటారు.

వెంకటేశు ఆనందంగా కోర్టు బయటకు ఈలేసుకుంటూ వస్తుంటే కోర్టు జవాను ఓ వెకిలినవ్వు నవ్వి ''పిచ్చివాడా అంత ఆనందపడకు. ఇది రామజన్మస్థలంకాదు, వివాద జన్మస్థలం! ఈ బొమ్మల కోసం, మట్టిగోడలకోసం నాదీ నాదంటూ నీలాగే వచ్చినవాళ్లందరిదగ్గర ఇదే కోర్టు ఆరువేల పిటిషన్లు తీసుకుంది. నిజం చెప్పాలంటే ఈ స్థలం ఎవరికీ అక్కర్లేదు. వాళ్లక్కావాల్సిందల్లా వివాదం. నీకెందుకొచ్చిన గొడవలుగానీ త్వరగా తిరుపతి పో. దేశమంతటా గొడవలు పాతుకున్నాయి. అసలే నీకు బీబీ నాంచారికూడా వుంది. త్వరగా వెళ్లి నీ తిరుపతిని కాపాడుకో!'' అంటాడు.

వెంకటేశు వెనుదిరిగి పంచె ఊడిపోతుంటే ఎగలాక్కుంటూ రొప్పుతూ పరుగెడుతూ వుంటే దార్లో ఓ గులాబీ పూవు చూసి ఫక్కున నవ్వుతుంది.

''ఏం నవ్వు?'' అనడుగుతాడు వెంకటేశు.

''పిచ్చివాడా - జనాలకి గుళ్లూ మసీదులమీదున్నది భక్తికాదనీ, వాళ్లల్లో వాళ్లకి కోపాలొస్తే గుడైనా మసీదైనా నేలమట్టం చేసేసి విగ్రహాల్ని అవతల పారేస్తారని ఇంకా గ్రహించలేదా? తిరుపతిని కాపాడేసుకుందామనే ఈ పరుగు? ఇవాళ కాకపోయినా రేపయినా నీకూ ఇది తప్పదు. నీ గుడికూడా నేలమట్టం చేసి నిన్ను ఆ కొండలమీంచి కిందకి గిరాటెయ్యకముందే, హాయిగా ఇండియా వదిలేసి మీ స్వర్గానికి పో!'' అంటుంది గులాబి పూవు.

వెంకటేశు తిరుపతి దారి వదిలేసి నేరుగా స్వర్గానికి వెళ్లిపోతాడు.

కథ పూర్తయింది. రైటింగ్ పాడ్ పక్కకి పెట్టి, కళ్లజోడు పక్కన పెట్టి వెనక్కి ఈజీ చైర్లో వాలుతూ ''ఒరే చిన్నాడా, ఎదురింట్లో గులాబీ పిల్లనోసారి నేన్రమ్మన్నానని పిలవరా'' అన్నాను మా చిన్నాడితో.

మా ఇంటి ఎదురింట్లో వుండే రోజీ అనే క్రిస్టియనమ్మాయిన్నేను ముద్దుగా గులాబీపిల్ల అని పిలుస్తాను. చిన్నప్పణ్ణించీ ఎరుగుదును ఆ అమ్మాయిని. ప్రస్తుతం ఆ అమ్మాయి ఎమ్మే తెలుగు లిటరేచర్ చేస్తోంది. నేనెప్పుడైనా కథ రాస్తేకథ రాస్తే ముందా అమ్మాయికి చూపిస్తాను. గులాబీ పిల్లకి నచ్చితే అది ప్రచురణకి పంపిస్తాను. లేకుంటే నా ఫైల్లోకి పంపిస్తాను.

రోజీ వచ్చింది. ఆ అమ్మాయికి నా కథ చూపించాను. పది నిమిషాలపాటు ఏకాగ్రంగా కథ చదివి కిసుక్కున నవ్వింది గులాబీ పిల్ల.

''ఏమ్మా - నామౌచిత్యం లేదా?''

''నామౌచిత్యానిదేముందిలెండి చివర్లో ఏదో కలిపారుగదా?''

''శైలి బాగోలేదా?''

''శైలికేమంకుల్, శైలి బానే వుంది. కానీ ఈ కథ అసలెందుకు రాసారో అర్థం కావడంలా!'' అంది గులాబీ పిల్ల.

''ఎందుకేవిటి? వివాదాలని పరిష్కరించకుండా పెంచుకుంటూ పోతున్న మన న్యాయవ్యవస్థకోసం రాశా, వివాదాలని కోరుకునే మనుషులకి గుడైనా, మసీదైనా ఓ మట్టి గోడే తప్ప అక్కడ ఏ దేవుడూ లేడని స్పష్టంగా రాశా. మతం ఉచ్చులో పడొద్దని రాశా!


''అంకుల్ మీరు సమస్యని చూపించి వదిలేశారు. దానికి పరిష్కారం సూచించలేదు. మీరు సమస్యల్లా వివాదానిదేనని రాశారు. వివాదానికి మూలకారణం రెండు నమ్మకాల మధ్య వ్యతిరేకత! అంచేత ఈ కథలో మూలమైన సమస్య వివాదం కాదు నమ్మకం.

''అంటే ఈ సమస్యకి కారణం గుళ్లో లేదంటావా?

''అవునంకుల్ సమస్య గుడిదికాదు. కొన్ని వందల సంవత్సరాల్నుంచీ ఈ అయోధ్య సమస్య వుంది. సమస్యల్లా ప్రభుత్వానిది. తెల్లవాడయినా మనవాడైనా ప్రభుత్వానికి ఏ ఢోకా లేదనుకున్నంతకాలం దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఈ రోజయినా గుడి

## పిల్లులూ... పిల్లలూ!!

కేరళలోని వడాకారా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ మధ్య పిల్లుల బాధ బాగా ఎక్కువైపోయింది! అప్పుడప్పుడు స్త్రీలు ప్రసవించిన తర్వాత పిల్లల్ని పిల్లులు ఎత్తుకుని వెళ్లే స్థితికి ఈనాడు ఆ పిల్లల బెడద చేరింది! దాంతో ఏమీ చేయలేని ఆసుపత్రి అధికారులు ఇకనుంచి ప్రసూతికోసం వచ్చేవారు వారికి పుట్టిన బిడ్డల్ని పిల్లులు ఎత్తుకుపోయినా - ఆసుపత్రి బాధ్యత వహించదనే విషయానికి కట్టుబడి వుండాలనే నియమం విధించింది! చూశారా సార్! ఎంతగొప్ప అధికార్లో వారు? హాట్సాఫ్ టూయూ సార్!!



- జూపిటర్

పడిపోవడానికి కారణం మతం కారణం కాదు. రాబోయే ఎన్నికలే కారణం''

''సమస్య సరేనమ్మా, మరి దీనికి పరిష్కారం వుందా?''

''ఉందిగానీ అది అసాధ్యం. ప్రభుత్వం మతాన్ని త్యజించడమే దీనికి పరిష్కారం''

''అంటే?''

''అంటే ఒకసారి ఎన్నికల్లో గెలిచిన ఏ అభ్యర్థి అయినా తను ఏ మతానికీ చెందనివాణ్ణని ప్రమాణం చేయాలి. తాను పదవిలో వున్నంతకాలం గుడికిగానీ, మసీదుకుగానీ, చర్చికిగానీ వెళ్లడం నేరంగా పరిగణించాలి. మత చర్చల్లోగానీ, మత సంఘాలకి వెళ్లడంగానీ, ఆఖరికి పండగలొచ్చినప్పుడు ఆయా మతాలవారికి శుభాకాంక్షలు తెలపడంకూడా నేరంగా పరిగణించాలి''

''ఇందులో అసాధ్యమేముందీ?

''మీరింక పాతకాలంలో వున్నారంకుల్. ఇపుడు రాజకీయ నాయకులు మతశక్తులపై పోరాటాన్ని తిరుపతిలో స్వామివారిని దర్శించి కొబ్బరికాయ కొట్టి మొదలెడతారు. సారా వ్యతిరేక ఉద్యమమైనా అక్కడే స్వామివారి ఆశీస్సులతోనే మొదలు. ఆఖరికి ఇందాక అనుకున్నట్టుగా మతం రాజకీయాన్ని వేరుచేస్తూ చట్టాన్ని తేవాలన్నా ముందు స్వామిని దర్శించుకునే నిర్ణయం తీసుకుంటారు''

''బాగుందమ్మా పరిష్కారం వుందంటావ్వూ, అది అసాధ్యమంటావ్వూ, నన్ను పరిష్కారం చూపించమంటావ్వూ! ఎలా?

''ఇలా'' అంటూ నా కథలో మొదటి పేజీలో హెడ్డింగు పెన్నుతో అడ్డంగా కొట్టేసి నవ్వుకుంటూ వాళ్ల ఇంట్లోకి తుర్రుమంది గులాబీపిల్ల.

నాకేమీ బోధపడ్లేదు. టైటిల్ మార్చమంటుందా ఏమిటి? నామౌచిత్యం బానేవుందందిగా? అనుకుంటూ నా కథని మళ్లీ ఓసారి చేతిలోకి తీసుకున్నా.

ఆశ్చర్యం! ఆ గులాబీ పిల్ల కొట్టేసింది కథ పేరుని కాదు. ఆదనికన్నా పైన చిన్న చిన్న అక్షరాల్లో వున్న ''శ్రీరాములు నీవేకలవు'' అనే వాక్యాన్ని!

అంతే ఆ అమ్మాయి ఆంతర్యం బోధపడింది నాకు. కథకి మళ్లీ కొన్ని మార్పులు చేశాను.

ప్రస్తుతమున్న కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థని మార్చడం కానిపని. ఎందుకంటే నా చిన్నప్పుడు బళ్లో పంతులుగారు నేర్పించిన 'శ్రీరాములు నీవే కలవు' అని ఎందుకు రాస్తున్నానో తెలియకపోయినా ఇంకా రాస్తూనే వున్నాను. ఈ తరాన్ని ఇలాగే కొట్టుకు చావనివ్వండి.

కానీ రాబోయే తరానికి మాత్రం ఒకటో క్లాసునుంచే హిందువులు గుడికెళ్తారు, ముస్లింలు మసీదుకెళ్తారు, క్రైస్తవులు చర్చికి వెళ్తారు పాఠాలు నూరిపోయడం మానేసి, మనది భారతదేశము. భారతీయులంతా ఒకే జాతి. పాకిస్తాను విదేశము. వారు భారతీయులుకారు. మనదేశమునకు రాజ్యాంగమున్నది. అది భారతీయులందరికీ సమానముగా వర్తించును. విదేశీయులకు మన రాజ్యాంగము వర్తించదు. అంటూ దేశం తప్ప మరోటి లేదని నూరిపోద్దాం.

అప్పుడు ఆ తరం మతాన్ని మర్చిపోతుందాని సందేహం ఏమీ అక్కర్లేదు. నా చిన్నప్పుడు తెలుగు అచ్చుల్లో ''లు, లూ''లు దిద్దించేవారు. అసలా అక్షరాలు ఉన్నట్లు ఇప్పటి తరానికి తెలీనే తెలీదు. ఎందుచేత?

కథ పూర్తిచేసి ఎదురింటికేసి చూశాను. ఎదురింటి గులాబీ నవ్వింది మళ్లీ!

★★★

★